క్లుప్తంగా

చందన అలంకారంలో భ్రమరాంబ అమ్మవారు



పెదకాకాని: శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి దేవస్థానంలో శ్రావణ మాసం రెండో శుక్రవారం పురస్కరించుకొని అమ్మవారి మూలవిరాట్‌ను చందనంతో ప్రత్యేకంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో పొంగలి నైవేద్యాల్ని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్లకు నివేదించుకున్నారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఆలయ ఉప కమిషనర్ దాసర శ్రీరామవరప్రసాదరావు, సిబ్బంది ఏర్పాట్లు చేశారు. శ్రీ భ్రమరాంబ అమ్మవారికి శ్రావణమాస శుక్రవారాలలో పసుపు కొమ్ములు, లక్ష మల్లెపూలు, గాజులతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు డీసీ దాసర శ్రీరామవరప్రసాదరావు తెలిపారు. పూజల్లో అర్చకులు, వేద పండితులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

క్రెడిట్ సొసైటీల కంప్యూటీకరణ తప్పనిసరి

కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: జిల్లాలో ప్రైమరీ అగ్రికల్చరల్ క్రెడిట్ సొసైటీల కంప్యూటీకరణ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం, అనుకున్న సమయంలోనే పూర్తి చేయాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. స్థానిక వీడియో సమావేశ మందిరంలో శుక్రవారం జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజతో కలిసి నిర్వహించిన అధికారుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కంప్యూటీకరణతోపాటు సభ్యుల వివరాలు కూడా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. జిల్లాలో పీఏసీలు నాబార్డు రుణం ద్వారా నిర్మించిన మల్టీపర్పస్ గోడౌన్లలో స్థానిక రైతులు పంట ఉత్పత్తుల్ని నిల్వ చేసుకునేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. నూతక్కి పీఏసీకి మంజూరైన వరల్డ్ లార్జెస్ట్ గ్రెయిన్ ప్రాజెక్ట్ పనులు వెంటనే ప్రారంభించాలని చెప్పారు. పీఏసీల ఆధ్వర్యంలో కామన్ సర్వీస్ సెంటర్లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. రహదారి పక్కన ఉన్న పీఏసీ స్థలాల్లో పెట్రోల్ బంకులు, గ్యాస్ గోడౌన్ల ఏర్పాటుకు అవకాశాలను పరిశీలించాలని కలెక్టర్ వివరించారు. జేసీ మాట్లాడుతూ జిల్లాలోని 67 పీఏసీలలో 52 చోట్ల కంప్యూటీకరణ పూర్తయ్యిందని, మిగిలినవి త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు. సమావేశంలో డీపీవో శ్రీదేవి, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, జీడీసీసీ బ్యాంకు సీఈఓ కృష్ణవేణి, నాబార్డ్ డీడీఎం శరత్, జిల్లా మత్స్యశాఖాధికారి గాలి దేముడు పాల్గొన్నారు.

ఆ సీటు భలే హాట్ గురూ !

- డీఎంహెచ్ఓ కార్యాలయంలో యూడీసీ సీటుపై సర్వత్రా చర్చ
- ప్రస్తుతం ఖాళీ

గుంటూరు మెడికల్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం జనరల్ సెక్షన్ విభాగంలో ఉన్న జీ–1 సీటు గురించి నేడు సర్వత్రా చర్చ నడుస్తోంది. కొద్దోగొప్పో చేతివాటం ప్రదర్శించేవారికి కాసులు కురిపించే ఈ సీటు కొద్దిరోజులుగా ఖాళీగా ఉండటంతో ప్రతి ఒక్కరూ దక్కించుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. జీ–1 సీటు, ఎస్టాబ్లిష్మెంట్ సీటు విధులు నిర్వహిస్తున్న సీనియర్ అసిస్టెంట్ జూన్‌లో డైరెక్టర్ ఆఫ్ హెల్త్ (డీహెచ్)కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆ సీటు దక్కించుకునేందుకు అధికారుల్ని ప్రసన్నం చేసుకునే పనిలో కొందరు ఉద్యోగులు ఉన్నారు.

ఆసుపత్రుల రిజిస్ట్రేషన్లతో లబ్ధి

ప్రైవేటు ఆసుపత్రులు, ల్యాబ్‌లు, ఫిజియోథెరఫీ, డెంటల్ క్లినిక్‌లకు ప్రభుత్వ గుర్తింపుకోసం ఏపీ అల్లోపతిక్ మెడికల్ ఎస్టాబ్లిష్మెంట్ రిజిస్ట్రేషన్ యాక్ట్ ప్రకారం డీఎంహెచ్ఓ వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. జీ–1 సీటు ఉద్యోగి ప్రైవేటు హాస్పిటల్స్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్‌లో భాగంగా ప్రొసీడింగ్ విధులు నిర్వహిస్తారు. ఆసుపత్రులకు అనుమతులు మంజూరు చేసేందుకు ఉన్నతాధికారులదే చివరి నిర్ణయం అయినప్పటికీ జీ–1 సీటు ఉద్యోగి కీలకపాత్ర నిర్వహిస్తాడు. నిబంధనల ప్రకారం పూర్తిస్థాయిలో వైద్య సౌకర్యాలు, సిబ్బంది అన్ని ఆసుపత్రుల్లో ఉండవు. కొద్దోగొప్పో సడలింపు కోసం తనిఖీలకు వచ్చిన అధికారుల్ని లక్ష్మీప్రసన్నం చేసుకుంటారు. దీంతో కొద్దోగొప్పో ఆసుపత్రుల నిర్వాహకులు సీటు ఉద్యోగికి ముట్టజెబుతుంటారు. దీంతో అది నేడు హాట్‌కేక్‌లా మారింది.



డీఎంహెచ్ఓ కార్యాలయం

నిబంధనల ప్రకారం జనరల్ సెక్షన్‌లో ఉద్యోగికి విధుల్ని అప్పగించాల్సి ఉన్నప్పటికీ వైద్య అధికారులు ఆదిశగా అడుగులు వేయలేదు. గతంలో పని చేసిన డీఎంహెచ్ఓ విధుల్ని ఎస్టాబ్లిష్మెంట్ విభాగం ఉద్యోగికి కేటాయించారు. సదరు ఉద్యోగి రాష్ట్ర కార్యాలయానికి బదిలీ అవడంతో జనరల్ సెక్షన్‌లో ఉన్న వారికి అప్పగించాలంటూ పలువురు ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

డెమో సెక్షన్‌కు ఇవ్వాలంటూ వినతులు

డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఫోకల్‌గా ఉన్న జీ–1 సీటును జిల్లా మాస్ మీడియా విభాగానికి (డెమో) కేటాయించాలంటూ కొంత మంది డెమో కార్యాలయం ఉద్యోగులు ప్రయత్నాలు చేస్తున్నారు. హాస్పిటల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ అమలులోకి వచ్చిన నాటి నుండి ఆసుపత్రుల రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియను జనరల్ సెక్షన్‌లో జీ–1 ఉద్యోగి నిర్వహించేవారు. మినిస్టీరియల్ ఉద్యోగులకే జీ–1 సీటు కేటాయించాలని కార్యాలయ ఉద్యోగులు, అధికారులు ముక్తకంఠంతో తీర్మానం చేశారు. పలు జిల్లాల్లో డెమో కార్యాలయం సైతం హాస్పిటల్ రిజిస్ట్రేషన్ సీటు విధులు నిర్వహిస్తున్నారని, తమకే ఇవ్వాలంటూ ఆ విభాగం ఉద్యోగులు కోరుతున్నారు.

ఉద్యోగుల్లో కొరవడిన నైపుణ్యం

డీఎంహెచ్ఓ కార్యాలయంలో కిందిస్థాయి ఉద్యోగుల్లో నైపుణ్యం కొరవడిందనే విమర్శలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. సెక్షలో ఏదైనా ఫైల్‌ను తయారు చేసి వైద్య అధికారి వద్దకు తీసుకెళ్లాలంటే మల్లగుల్లాలు పడుతున్నారు. కొంత మంది రిటైర్డ్ ఉద్యోగుల వద్దకు వెళ్లి ఫైల్స్‌ను ఎలా రాయాలి అనే విషయాలను తెలుసుకుని సబ్‌మిట్ చేస్తున్నట్లు ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. ఒక పక్క ఉద్యోగుల్లో నైపుణ్యం కొరవడడం, మరోపక్క సీనియర్ అసిస్టెంట్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఖాళీ సీట్లు భర్తీ చేయాలంటూ ఆర్డీ కార్యాలయం వారికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం అధికారి లేఖ రాశారు.

కార్యాలయంలో ఉద్యోగుల కొరత

ప్రస్తుతం కార్యాలయంలో మినిస్టీరియల్ ఉద్యోగుల కొరత ఉంది. హాస్పిటల్ రిజిస్ట్రేషన్ల సీటు పలు జిల్లాల్లో డెమో విభాగం సిబ్బంది కూడా చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న మినిస్టీరియల్ ఉద్యోగులకు పనిభారం ఎక్కువగా ఉండటం వల్ల నూతనంగా సీనియర్ అసిస్టెంట్ల కోసం ఎదురు చూస్తున్నాం.

– డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, డీఎంహెచ్ఓ

స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల చేయాలి

గుంటూరు మెడికల్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టబోయే 1.60లక్షల మంది గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల రేషనలైజేషన్ ప్రక్రియకు ముందు ప్రతి శాఖ నుంచి స్పష్టమైన మార్గదర్శకాలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా ప్రభుత్వాన్ని కోరారు. గుంటూరు వైద్య కళాశాల ఆవరణంలోని యూనియన్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా కార్యవర్గ సభ్యులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చాంద్ బాషా మాట్లాడుతూ ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సీనియారిటీని పరిగణనలోకి తీసుకోవాలని, వాళ్లకు పదోన్నతుల విషయంలో స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని కోరారు. వేతన సంరక్షణ విషయంలో కూడా మార్గదర్శకాలు జారీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గ్రేడ్ –3 ఏఎన్ఎంలను వారి మాతృశాఖకు మార్పు చేస్తే వారందరినీ మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ ఫిమేల్ ఎంపీహెచ్ఏ (ఎఫ్)గా పరిగణించి అన్ని అలవెన్సులు ఇచ్చేలా మార్గదర్శకాలు జారీ చేయాలని తెలిపారు. మొబైల్ యాప్‌లను తొలగించి వారికి తీవ్రమైన ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ఈనెల 11న జరిగే రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆర్. సూర్య నారాయణ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శివారెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కరీముల్లా షొఖాదరి, నగరశాఖ అధ్యక్షుడు నాగేశ్వరరావు, మహిళా విభాగం జిల్లా కార్యదర్శి సుమిత్రా దేవి, సహాధ్యక్షురాలు హేమలత, నగరశాఖ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆషా సజిని, సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నాగరాజు, గ్రామ వార్డు సచివాలయం ఉద్యోగులు కోటా సాహేబ్, రాధాకృష్ణ, రత్తయ్య, నగర శాఖ కోశాధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చాంద్ బాషా

నేడు, రేపు పాఠశాలల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు

డీఈవో శైలజ

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలో అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలల్లో రెండో శనివారం, ఆదివారం విద్యార్థులకు తరగతులు నిర్వహించరాదని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహించిన పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీనిపై జిల్లాలోని ఉప విద్యాశాఖాధికారులు, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు.

12న ప్రతిజ్ఞ చేయించాలి

నషా ముక్త్ భారత్ అభియాన్ (ఎన్ఎంబీఏ) ప్రారంభించి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ఈనెల 12న ఉదయం 9 గంటలకు ''నా దేశాన్ని మాదక ద్రవ్యాల రహితంగా మార్చడానికి నా శక్తి మేరకు నేను చేయగలినదంతా చేస్తానని'' విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించాలని డీఈవో శైలజ తెలిపారు. డీవైఈవో, ఎంఈవోలు, హెచ్ఎంలు చర్యలు చేపట్టాలని ఆమె సూచించారు.

పిల్లల్ని విద్యావంతులుగా తీర్చిదిద్దాలి

ఆదివాసీ దినోత్సవంలో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: ఆదివాసీలు తమ బిడ్డల్ని విద్యావంతులుగా చేయడం ద్వారా వారికి మంచి భవిష్యత్తును అందించిన వారవుతారని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కల్యాణ మండపంలో నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో కలెక్టర్‌తోపాటు శాసన సభ్యులు గళ్లా మాధవి, బూర్ల వీరాంజనేయులు, డెప్యూటీ మేయర్ షేక్ సజీల, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే విద్య కీలక భూమిక పోషిస్తుందని తెలిపారు. గిరిజనులు ప్రపంచంలో 100 దేశాల్లో ఉన్నారన్నారు. వీరు 6,700 బాషలు మాట్లాడతారన్నారు. కేవలం ఉత్తర భారత దేశంలోనే 700 బాషలు పైగా మాట్లాడతారని, మన రాష్ట్రంలోనే 33 భాషలకు పైగా మాట్లాడే ఆదివాసీలు ఉన్నారని చెప్పారు. సుమారుగా 40 కోట్ల మంది జనాభా ఉన్నారని తెలిపారు. గుంటూరు జిల్లా జనాభాలో ఆదివాసీల శాతం 3 ఉందని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీలకు ఎంతో ప్రాధాన్యతనిస్తోందని చెప్పారు. పై చదువులకు స్కాలర్‌షిప్స్‌తో పాటు రెసిడెన్షియల్ స్కూల్స్, పాఠశాలలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కొన్ని మండలాల ఎస్టీ కాలనీల్లోని పిల్లలు పాఠశాలల్లో చేరలేదని, వారిని చేర్చేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ చెప్పారు. ఇండియాలో ఉన్న రెండు ట్రైబల్ యూనివర్సిటీల్లో ఒకటి మన రాష్ట్రంలోని విజయనగరంలో ఉందని తెలిపారు. గిరిజన ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ జారీ చేసినట్లు చెప్పారు. గుంటూరులో అర్హులైన 150 మందికి ఉచిత డీఎస్సీ కోర్సును అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ వివరించారు. కార్యక్రమం ప్రారంభంలో ఏకలవ్య, చెంచులక్ష్మి, బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిన్నారుల నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి శిరీష, బీసీ కార్పొరేషన్ ఈడీ దుర్గాబాయి, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



గిరిజన నాయకులకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ , ప్రజాప్రతినిధులు

న్యూ కాలనీని జల్లెడ పట్టిన పోలీసులు

- ఎస్పీ ఆధ్వర్యంలో సెర్చ్ ఆపరేషన్
- పత్రాల్లేని 18 బైక్‌లు సీజ్

నగరంపాలెం: వేకువజామున 4 గంటలు.. అప్పుడే మెల్లగా తెల్లారుతోంది. ఆ సమయంలో పోలీసులు, వాహనాల రాకతో న్యూకాలనీలో గందరగోళం నెలకొంది. అప్పటికే ఆ కాలనీలో చాలామంది నిద్ర నుంచి మేల్కోలేదు. ఇక సుమారు 145 మంది పోలీసులు రాకతో కంగారుపడ్డారు. స్థానికంగా ఏదైనా నేరం జరిగిందా ? అని చర్చించుకోవడం మొదలెట్టారు. ఆ నోట ఈ నోట పోలీసులు సెర్చ్ ఆపరేషన్ చేస్తున్నారని తెలుసుకున్నారు. ఈ దృశ్యాలు శుక్రవారం వేకువజామున 4 గంటల నుంచి ఉదయం ఏడు గంటల వరకు గుంటూరు నగరంపాలెం పీఎస్ పరిధిలోని మిర్చియార్డు వద్ద నున్న న్యూకాలనీలో కనిపించాయి.

విస్తృత తనిఖీలు

ఉదయం 5 గంటల నుంచి పోలీసులు విస్తృత తనిఖీల్ని ప్రారంభించారు. రహదారులకు ఇరువైపులా ముఖ ద్వారాల రాకపోకల్ని నియంత్రించారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ న్యూకాలనీ వద్దకు చేరుకున్నారు. జిల్లా ఏఎస్పీలు ఎ.శ్రీనివాసరావు (క్రైం), ఎం.వెంకటేశ్వరరావు (సెబ్), డీఎస్పీలు సుబ్బారావు (మహిళా పీఎస్), శివాజీరాజు (సీసీఎస్), సీఐలు మధుసూదనరావు (నగరంపాలెం పీఎస్), పి.కిరణ్ (పట్టాభిపురం పీఎస్) ఉదయ్‌బాబు (వట్టిచెరుకూరు పీఎస్), శ్రీనివాసరావు (పశ్చిమ ట్రాఫిక్), వంశీధర్ (నల్లపాడు పీఎస్), ఎస్ఐలకు జిల్లా ఎస్పీ దిశానిర్దేశం చేశారు. స్థానిక ఇళ్లల్లో తనిఖీలు చేపట్టారు. ఏం పేరు, ఎన్నాళ్లుగా ఉంటున్నారు, ఏం పనులకెళ్తారు ? అంటూ ఆధార్, ఇతరత్రా గుర్తింపు కార్డుల్ని పరిశీలించారు. అనంతరం మోటారు సైకిళ్ల పత్రాల్ని నిశితంగా తనిఖీ చేశారు. ఈ క్రమంలో ఎటువంటి పత్రాల్లేని 18 బైక్‌లను సీజ్ చేసినట్లు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ చెప్పారు. ఒడిశా నుంచి గంజాయి జిల్లాకు అక్రమ రవాణా అవుతుందనే ముందస్తు సమాచారంతో సెర్చ్ ఆపరేషన్ చేపట్టామని తెలిపారు.

ఒరిస్సా, బిహార్ రాష్ట్రాల్లోని కొందరు వలస పనుల నిమిత్తం ఇక్కడ ఉంటున్నారని పేర్కొన్నారు. ఇక నుంచి జిల్లాలోని ముఖ్యమైన కాలనీలు, గతంలో నేరం జరిగిన ప్రాంతాల్లోనూ ఈ తనిఖీలు చేపడతామని పేర్కొన్నారు. రౌడీషీటర్ల ఇళ్లల్లోనూ తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. అసాంఘిక శక్తులు, నేరస్తులపై చట్టపరమైన చర్యలు చేపడతామని, తద్వారా ప్రజానీకానికి భద్రతా భావాన్ని పెంపొందిస్తామని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలకు స్థానిక ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. తనిఖీల్లో ఎస్ఐలు, ఏఆర్ ఎస్ఐలు, సివిల్, ఏఆర్, ఎస్టీఎఫ్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



స్థానిక యువతతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్



పత్రాల్లేని టీవీఎస్‌ను తీసుకెళ్తున్న పోలీసులు

ముట్లూరు సచివాలయాల్లో ఆగంతకుల వీరంగం

- కిటికీల అద్దాలు ధ్వంసం
- ప్రింటర్లు, సీపీయూల అపహరణ

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం ముట్లూరు గ్రామ సచివాలయం –1, 2లో ఆగంతకులు అర్ధరాత్రి వీరంగం సృష్టించారు. కిటికీల గ్లాసులు పగలగొట్టారు. సచివాలయ భవనాల రెండు విద్యుత్ మీటర్లను పీకేశారు. ఒకదాన్ని గడ్డిలో పడేయగా, మరొక మీటరును తీసుకెళ్లారు. అంతటితో ఆగకుండా తలుపుల తాళాలు పగలగొట్టి, సచివాలయాల్లోని రెండు ప్రింటర్లు, రెండు సీపీయూలను అపహరించుకుపోయారు. శుక్రవారం ఉదయం ఎప్పటిలానే విధులకు వచ్చిన సిబ్బంది బయట అద్దాలు పగలగొట్టి ఉండటం, సామగ్రి విలువైన వస్తువులు కనిపించకపోవడంతో వట్టిచెరుకూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా కొద్దిరోజుల కిందట ఇదే సచివాలయంలో ఆకతాయిలు కిటికీ అద్దాలు పగలగొట్టి నానా భీభత్సం చేశారు. అధికారులు గానీ పోలీసులు గానీ చర్యలు తీసుకోకపోవడంతో ఆగంతకులు మరోసారి రెచ్చిపోయారన్న ఆరోపణలు గ్రామస్తుల నుంచి వినిపిస్తున్నాయి.



ఆకతాయిలు ధ్వంసం చేసిన కిటికీల అద్దాలు

రేషన్ దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని రేషన్ దుకాణాల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, పౌరసరఫరాల అధికారులతో కలిసి శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. స్థానిక మహబూబ్‌నగర్ కాలనీలోని 30వ నంబరు, రజక రామాలయం వెనుకనున్న 2వ నంబరు రేషన్ దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు. రిజిస్టర్లలో లెక్కలకు, దుకాణంలో సరుకు నిల్వలకు మధ్య వ్యత్యాసాలున్నాయా అన్నది సరి చూశారు. ఈ సందర్భంగా సీఎస్ డీటీ పద్మజ మాట్లాడుతూ రేషన్ దుకాణాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించామని, ఎలాంటి వ్యత్యాసాలు లేవని తెలిపారు. అయితే గతంలో ఎప్పుడు విజిలెన్స్ అధికారులు తనిఖీలకు వచ్చినా సీఐ, ఎస్ఐ స్థాయి అధికారులు ఉండేవారు. కానీ ఇక్కడ మాత్రం హెడ్‌కానిస్టేబుల్ స్థాయి అధికారి తనిఖీలు చేయడం గమనార్హం. సీఐ సెంటరులో ఉన్నారని సదరు విజిలెన్స్ అధికారులు చెప్పడం కొసమెరుపు.



తనిఖీలు చేస్తున్న విజిలెన్స్, పౌరసరఫరాల శాఖ అధికారులు

రేంజ్‌లో మరో 10 మంది సీఐల బదిలీ

నగరంపాలెం: గుంటూరు రేంజ్ పరిధిలో మరో పది మంది సీఐలను బదిలీ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి గురువారం ఉత్తర్వులు జారీచేశారు.

సీఐ పేరు	- ప్రస్తుతం -	బదిలీ
ఎం.రామనాయక్	-పాములు సర్కిల్, ప్రకాశం జిల్లా	-వట్టిచెరుకూరు యూపీఎస్,గుంటూరు జిల్లా
ఎన్.కిశోర్‌బాబు	- సీఐడీ, ఏపీ	-గుడూరు రూరల్ సర్కిల్, తిరుపతి
జి.సంగమేశ్వరరావు	- వెంకటగిరి సర్కిల్, తిరుపతి	-నాయుడుపేట రూరల్ సర్కిల్, తిరుపతి జిల్లా
ఎ.వెంకటరమణ	-ఎస్సీఎస్టీ సెల్, ప్రకాశం	-వెంకటగిరి సర్కిల్, తిరుపతి జిల్లా
జి.ఎల్.శ్రీనివాసరావు	- ఏసీబీ, ఏపీ	-మార్టూరు సర్కిల్, బాపట్ల జిల్లా
వై.వి. రమణయ్య	-రేంజ్ వీఆర్, గుంటూరు	-ఇంకొల్లు సర్కిల్, బాపట్ల జిల్లా
వై.పాండురంగారావు	-రేంజ్ వీఆర్, గుంటూరు	-ట్రాఫిక్ ఒంగోలు, ప్రకాశం జిల్లా
కామరాజుగడ్డ సాంబశివరావు	-సీసీఎస్, ఏసీపీఎస్ నెల్లూరు	-నెల్లూరు ఆరో టౌన్ పీఎస్
మద్ది శ్రీనివాసరావు	-సీఐడీ ఏపీ	-ఎస్‌పీఎస్ నెల్లూరు త్రీ టౌన్ పీఎస్
బి.హరికృష్ణ	-రేంజ్ వీఆర్	-బాపట్ల రూరల్ సర్కిల్, బాపట్ల

జిల్లా జైలులో ఎస్పీ ఆకస్మిక తనిఖీలు

నగరంపాలెం: బ్రాడీపేటలోని జిల్లా కారాగారంలో ఎస్పీ సతీష్‌కుమార్ శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జైలు నిర్వహణ, సిబ్బంది పనితీరు, విధి నిర్వహణ, ప్రధాన కేసుల్లో ముద్దాయిల వివరాలు, రోస్టర్‌లో నమోదు, పలు రికార్డుల్ని పరిశీలించారు. ముఖ్య పెండింగ్ కేసులు, ముద్దాయిల విచారణ, ఇతరత్రా అంశాల్ని జైలు సూపరింటెండెంట్ కె.రఘు జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకొచ్చారు. ముద్దాయిల భద్రతపై జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. హత్యలు, హత్యాయత్నాలు, ఇతర కేసుల్లో రిమాండ్‌లో ఉన్న కేసులు ఇతరత్రా వాటిపై సమీక్షించారు. రిమాండ్‌లోని రౌడీషీటర్ల కదలికలు, కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని తెలిపారు. జైలు నుంచి విడుదలైన ఖైదీల వివరాల్ని సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులకు అందించాలని ఆదేశించారు. జైలు అధికారులకు సహాయ, సహకారాలు అందిస్తామని జిల్లా ఎస్పీ చెప్పారు. ఆయన వెంట ఎస్‌బీ సీఐ ఆనంద్ ఉన్నారు.



జైలు సూపరింటెండెంట్ రఘుతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు జట్టుపై కృష్ణా ఆధిక్యం

మంగళగిరి: నగరంలోని అమరావతి టౌన్‌షిప్‌లో గల ఏసీఏ క్రికెట్ స్టేడియంలో నిర్వహిస్తున్న మల్టీ ఇంటర్ డిస్ట్రిక్ పోటీల్లో భాగంగా శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో గుంటూరు జట్టుపై కృష్ణా జట్టు ఆధిక్యం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కృష్ణా జట్టు 48.3 ఓవర్లలో 195 పరుగులు చేసింది. గుంటూరు జట్టు 103 పరుగులు చేసింది. కృష్ణా జట్టు బ్యాట్స్‌మేన్ విశాల్ 51 పరుగులు సాధించగా, గుంటూరు జట్టు బౌలర్ సిద్ధార్థ నాలుగు వికెట్లు తీసి రాణించాడు.



గుంటూరు బౌలర్ సిద్ధార్థ



కృష్ణా బ్యాట్స్‌మేన్ విశాల్

మహిళా హెడ్‌కానిస్టేబుల్‌కు ఇన్‌స్పెక్టర్ లైంగిక వేధింపులు

కేసు నమోదు చేసిన జీఆర్పీ పోలీసులు

తెనాలి రూరల్: ఉదయం బాలల హక్కులు, బాలల అక్రమ రవాణాపై విద్యార్థులకు హితబోధ చేసిన ఇన్‌స్పెక్టర్‌పై రాత్రికి లైంగిక వేధింపుల కేసు నమోదైంది. ఆర్పీఎఫ్ మహిళా కానిస్టేబుల్‌పై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న ఇన్‌స్పెక్టర్‌పై జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ వెంకటాద్రి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తెనాలి రైల్వేస్టేషన్‌లోని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్పీఎఫ్)లో హెడ్‌కానిస్టేబుల్ పని చేస్తోంది. తనతో ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ అబ్దుల్ ఖలీల్ అసభ్యంగా మాట్లాడటమే కాకుండా, జులై 19న తనను తాకడంతోపాటు వెనుక నుంచి పట్టుకుని ఆర్పీఎఫ్ స్టేషన్ పైనున్న రెస్ట్ రూమ్‌కు రావాలని వేధించినట్టు బాధితురాలు జీఆర్పీ పోలీసులను ఆశ్రయించింది. ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్‌పై కేసు నమోదు చేసినట్టు జీఆర్పీ ఎస్ఐ వెంకటాద్రి శుక్రవారం రాత్రి తెలిపారు.

వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు నష్టదాయకం



తాడేపల్లి రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన వక్ఫ్ సవరణ బిల్లుతో తీవ్ర నష్టం వాటిల్లుతుందని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని అన్నారు. శుక్రవారం దుగ్గిరాల గ్రామంలోని ముర్తుజా నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్‌లో వైఎస్సార్‌సీపీ ఎంపీలు వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకంచడం హర్షణీయమని తెలిపారు. 40 సవరణలు చేసేందుకు బిల్లు పెట్టారన్నారు. దేశంలో రైల్వే, రక్షణ శాఖల తర్వాత వక్ఫ్ బోర్డు భూములు అధికంగా ఉన్నాయని తెలిపారు. సవరణలతో వక్ఫ్‌బోర్డు అధికారుల్ని తగ్గించడంతోపాటు మహిళలు, ముస్లిమేతరులను బోర్డులో చేర్చాలనే ప్రతిపాదన సరికాదని పేర్కొన్నారు. ముస్లింల మనోభావాల్ని అర్థం చేసుకుని కేంద్రం పునః సమీక్షించాలని ఆయన కోరారు. సమావేశంలో మైనార్టీ నేతలు షేక్ రషీద్ సాహెబ్, పఠాన్ మస్తాన్ వలీ పాల్గొన్నారు.